## కథ

# మా ఇంటి మహారాణి

**ఇంగ్లాండ్‌లో మా వారి ప్రాజెక్టు పని పూర్తయింది. తిరుగుప్రయాణమయ్యాం. నాలుగు నెలల్లో పూర్తవుతుందనుకున్న వర్క్ పూర్తయ్యేటప్పటికి ఆరు నెలలు పట్టింది.**

**గత ఆరు నెలల నుండి మా వారితో పాటు నేను కూడా లండన్‌లోనే గడిపాను.**

ఎప్పుడెప్పుడు హైదరాబాద్ వచ్చి పిల్లలతో కలసి గడుపుతానా అనిపించింది. విమానంలో ప్రయాణిస్తున్నంత సేపు పిల్లల జ్ఞాపకాలతో గడిపాను. మా వారు విశ్రాంతిగా కళ్లు మూసుకున్నారు. బహుశ పని పూర్తవ్వడం వల్ల కలిగిన ఆనందం కాబోలు అనుకున్నాను.

పిల్లలు ఎలా ఉన్నారో? ఏమిటో? ఆలోచనలు వారి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

అమ్మను, నాన్నను ఏలూరు నుండి హైదరాబాద్ రప్పించి పిల్లలను వారికి అప్పజెప్పి నేను కూడా ఆయనతో పాటు ఇంగ్లాండ్ వెళ్లాను.

అప్పుడప్పుడు మా వారు ఆఫీసు పని మీద విదేశాలకు వెళ్లడం, రెండు మూడు నెలలు గడిపి రావడం మామూలే! ప్రతిసారీ ఒంటరిగా వెళ్లి ప్రాజెక్టు పని పూర్తయ్యాక వచ్చేసేవారు.

ఈసారి ఎందుకో మరి... "వకుళా! నువ్వు కూడా నాతో పాటు రావూ!" అని రెండు, మూడుసార్లు అడిగారు.

నిజం చెప్పొద్దూ! నాకు కూడా వెళ్లాలనిపించింది.

ఆయన మల్టీ నేషనల్ కంపెనీలో పని చేస్తుండడం వల్ల ముందుజాగ్రత్తగా నాకు, పిల్లలకు గతంలోనే పాస్‌పోర్ట్ తీసుకున్నారు.

పిల్లలు స్కూల్‌లో చదువుతున్నారు కదా! ఎలా? ఆలోచించాను. పెద్దవాడు ఐదవ తరగతి, రెండోవాడు మూడో తరగతి చదువుతున్నారు.

నాన్నగారితో ఫోన్‌లో మాట్లాడాను. నాన్న బ్యాంక్‌లో మేనేజర్‌గా చేసి మొన్నామధ్యనే రిటైరయ్యారు. అమ్మ, నాన్న ఏలూరులో సొంత ఇంట్లో ఉంటున్నారు.

"ఇద్దరూ సరదాగా వెళ్లి రండమ్మా! నాలుగు నెలలే అంటున్నావు కదా! మేము హైదరాబాద్ వచ్చి పిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటాం. మీరు నిశ్చింతగా వెళ్లి రండి" అన్నారు నాన్న.

"పిల్లల్ని అమ్మ చూసుకోగలదా నాన్నా?" సందేహంగా అడిగాను.

అమ్మ మీద పిల్లల బాధ్యత వదలి వెళ్లాలంటే మనసులో ఒకింత గిల్టీగా అనిపించింది.

"ఫర్వాలేదమ్మా! నేను ఖాళీగానే ఉంటాను గదా! అమ్మకు పనుల్లో సాయం చేస్తానులే. మీరు తిరిగి వచ్చే వరకు పిల్లల బాధ్యత మాది!" నాన్న నవ్వారు ఫోన్‌లో.

ఏలూరులో పనులు చక్కబెట్టుకుని రెండు రోజుల్లో అమ్మ, నాన్న హైదరాబాద్ వచ్చారు.

అమ్మకు పదేపదే జాగ్రత్తలు చెప్పాను.

స్కూలుకు పిల్లల్ని తయారుచేసి పంపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, వాళ్ల అలవాట్ల గురించి, ఇష్టమైన వంటకాల గురించి చెప్పాను.

"ఇద్దరూ కొట్టుకుంటారు జాగ్రత్త! మధ్యలో నువ్వు జోక్యం చేసుకుంటే బి.పి. రాగలదు. నువ్వు పట్టించుకోకుండా ఊరుకో. కొద్దిసేపట్లో వాళ్లే కలసిపోయి ఆడుకుంటారు" అని చెప్పాను.

అమ్మ మృదువుగా నవ్వింది.

"ముగ్గురు పిల్లల్ని కని పెంచాను. పిల్లలు కొట్టుకుంటారని ఆ మాత్రం తెలియదా వకుళా! కొట్టుకోకుండానే మీరు ముగ్గురూ పెరిగి పెద్దవారయ్యారా?" అంది మురిపెంగా.

పిల్లలకు కూడా సవాలక్ష జాగ్రత్తలు చెప్పాను.

అమ్మమ్మను, తాతయ్యను విసిగించవద్దని, టైమ్‌కు హోంవర్క్ చేసుకోమని, బుద్ధిగా ఉండమని చెప్పాను.

అలాగే అన్నట్టు తలూపారు ఇద్దరూ.

పిల్లల్ని చూడాలని మనసు ఆరాటపడుతోందిపుడు. ఎన్నడూ వాళ్లను వదలి ఒక్క రోజు కూడా ఉండలేదు. ఇదే మొదటిసారి ఇలా వదిలి వెళ్లడం. బెంగ ఉండదూ మరి!

హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన పిల్లల్ని చూసిన తర్వాత ఆనందంతో కూడిన కన్నీరు పెల్లుబికి వచ్చింది.

అమ్మను, నాన్నను పట్టించుకోకుండా పిల్లలను తృప్తిగా చూసుకుని వారి భుజాల మీద ఆప్యాయంగా చేతులు వేసి మాట్లాడాను.

"బావున్నారా మామయ్య గారూ? అత్తయ్యా! మీరు బాగా చిక్కిపోయారు. పిల్లలు బాగా విసిగించి ఉంటారు కదూ!" అమ్మతోను, నాన్నతోనూ ఆప్యాయంగా మాట్లాడుతూ నెమ్మదిగా నా చేతి మీద తట్టారు ఆయన.

అప్పుడు గానీ నేను చేసిన తప్పేమిటో నాకు అర్థం కాలేదు.

మరుక్షణంలో తేరుకుని వారి వైపు తిరిగి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నాను.

పిల్లలు అలుపెరగకుండా కబుర్లు చెబుతూనే ఉన్నారు. వారి కోసం తెచ్చిన బహుమతులు చూసి సంబరపడ్డారు.

స్నానం చేశాక హాయిగా అనిపించింది. వంటగదిలో పనితో సతమతమవుతున్న అమ్మ దగ్గరకు వెళ్లాను.

"అమ్మా! నేను వంట చేస్తాను. నువ్వు రెస్ట్ తీసుకో" చకచకా పనిచేయసాగాను.

ఇంగ్లాండ్‌లో మేము చూసిన పర్యాటక ప్రాంతాల గురించి, అక్కడి ప్రజల అభిరుచులు, అలవాట్ల గురించి అమ్మకు వివరించి చెబుతూ వంట పూర్తి చేశాను. భోజనాలు పూర్తయ్యాయి. బెంగుళూరులో ఉన్న అక్కకు, ఢిల్లీలో ఉన్న అన్నయ్యకు ఫోన్ చేసి మాట్లాడాను.

బందరులో పూర్వీకులు ఇచ్చిన పాత ఇంట్లో ఒంటరిగా కాలం గడుపుతున్న మా అత్తగారికి ఆయన ఫోన్ చేసి మాట్లాడారు. ఆమెతో నేను మాట్లాడి చాలా కాలమైంది.

ఆయన చేతిలో నుండి ఫోన్ తీసుకుని అత్తగారితో మాట్లాడాను.

"అత్తయ్యా! బావున్నావా? ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగాను.

"బాగానే ఉన్నాను. మీ అందరినీ చూడాలనిపిస్తోంది" అంది.

నేను బదులు చెప్పలేదు. ఫోన్ ఆయనకు ఇచ్చి ఎవరో రావడంతో హాల్‌లోకి వెళ్లాను. మా వారు ఫోన్‌లో తల్లితో మాట్లాడుతూ బాల్కనీలోకి నడిచారు.

కొద్దిసేపు గడిచింది.

"వకుళా! అమ్మను చూడాలనిపిస్తోంది. బందరు వెళ్లి వస్తాను. వీలైతే నువ్వు, పిల్లలు కూడా రాకూడదూ! మనల్ని చూడాలని అమ్మ ఆశపడుతోంది" అన్నారాయన.

పిల్లల గదిలో అల్మెరా సర్దుతూ తలతిప్పి ఆయన వైపు చూశాను. అభ్యంతరం చెప్పాలనిపించింది.

"పిల్లలకు సెలవులు లేవు. అటూ ఇటూ తిరిగితే పిల్లల చదువు పాడవుతుంది" అన్నాను.

"పోనీ నాతో పాటు నువ్వు కూడా రా! అమ్మ సంతోషిస్తుంది. రెండు రోజుల్లో తిరిగి వచ్చేద్దాం! ఇక్కడ పిల్లల్ని

**అరుణ**

చూసుకోడానికి మీ అమ్మ, నాన్న ఉన్నారు కదా!" ఆశగా అన్నారా యన.

అప్పుడే గదిలోకి వచ్చింది అమ్మ. మా సంభాషణ వింటను కుంటాను.

"వెళ్లి రండమ్మా! పెద్దావిడ మిమ్మల్ని చూస్తే సంతోషిస్తుంది" అంది.

గభాల్న అమ్మ వైపు తిరిగాను. కొద్ది క్షణాలు అలాగే చూశాను. అమ్మ జంకినట్లుగా అనిపిం చింది. మరు నిమిషంలో పని ఉన్నట్టు గెస్ట్ రూమ్‌లోకి వెళ్లింది. అందులోనే అమ్మ, నాన్న ప్రస్తుతం ఉంటున్నారు.

బందరు వెళ్లడం నాకిష్టం లేదు. మౌనంగా ఉన్న నన్ను చూసి మా వారికి అర్థమై ఉంటుంది. నా మొండితనం గురించి ఆయనకు బాగా తెలుసు.

"సరే! నేను ఒక్కడ్నీ వెళ్లి అమ్మను చూసి వస్తాను. రేపు ఉదయం బయల్దేరతాను" అన్నారు.

నేను సమాధానం చెప్పకుండా ఊరుకున్నాను.

మర్నాడు తెల్లవారుజామున ఆయన బందరు బయల్దేరారు. అదే రోజు రాత్రి అమ్మ, నాన్న ఏలూరు ప్రయాణమయ్యారు.

"కొద్ది రోజులు ఉండండి నాన్నా! నిన్న మేము వచ్చామని ఈ రోజు మీరు ప్రయాణమైతే ఎలా?" అన్నాను కినుకగా.

అమ్మ, నాన్న ఇవాళ ప్రయాణమవుతారని నేనసలు ఊహించలేదు.

నాన్న నవ్వారు.

"ఇల్లు వదిలి వచ్చి చాలా కాలమైంది కదమ్మా! పిల్లల్ని చూసుకోవడానికి ఇంత కాలం ఇక్కడ ఉన్నాం. ఇప్పుడు మీరు వచ్చేశారు గదా" అన్నారు నాన్న రిజర్వే షన్ టికెట్ సరి చూసుకుంటూ. నేను బ్రతిమిలాడినా ప్రయోజనం లేదని నాకర్థమైంది.

అమ్మను, నాన్నను రైల్వేస్టేషన్ వద్ద దింపడానికి కారు బయటికి తీశాను. కారు డ్రైవ్ చేయడం నాకు అలవాటే!

ఇన్నాళ్లు బాగా మాలిమి అవ్వడం వల్ల కాబోలు అమ్మ పెద్దవాడికి జాగ్రత్తలు చెబుతోంది. నాన్న చిన్నవాడిని అల్లరి చేయవద్దని, అన్నతో పేచీ పెట్టుకోవద్దని హిత బోధ చేస్తున్నారు.



రైలులో కూర్చున్న తర్వాత అమ్మ నాతో ఏదో చెప్పడానికి ప్రయ త్నిస్తోంది కానీ చెప్పలేకపోతోంది.

"ఏమిటమ్మా?" అడిగాను.

రైలు బయల్దేరడానికి ఇంకా ఐదు నిమిషాలు టైముంది.

"చిన్నతల్లీ!" అమ్మ పిలిచింది. ఆ పిలుపంటే నాకు చాలా ఇష్టం. ఇంట్లో నేను అందరి కంటే చిన్నదాన్ని కావడం వల్ల అప్పుడప్పుడు అమ్మ నన్ను అలాగే పిలు స్తుంది.

"దిండు కింద..." అమ్మ ఏదో చెప్పబోయింది.

పెద్దవాడు అడ్డు తగిలాడు. "అమ్మమ్మా! హాలిడేస్‌లో మేము ఏలూరు వస్తాము" అన్నాడు.

"అలాగే! తప్పకుండా రండి" అమ్మ మనవడ్ని ముద్దు పెట్టుకుంది ఇష్టంగా.

నాన్న జాగ్రత్తలు చెప్పారు నాకు.

"జాగ్రత్త వకుళా! పిల్లల మీద విసుక్కోవద్దు. ఎన్నడూ కొట్టవద్దు. బాగా చదివించు" అన్నారు. స్టేషన్‌కు బయల్దేరే ముందు ఇద్దరూ ఘర్షణ పడుతుంటే గట్టిగా అరిచి చెరో దెబ్బ వేశాను. చిన్నవాడు ఓ నిమిషం పాటు రాగం ఎత్తుకున్నాడు. నాన్న గమనించారనుకుంటాను. అందుకే అలా చెప్పారు నాకు.

నరేనన్నట్టు తలూపాను.

"అల్లుడిగారిని ఏ విషయంలోను నువ్వు కష్టపెట్టకూడదు. ఆయన మనసెరిగి నడుచుకో..." నాన్న ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నించారు.

"పిల్లల్ని తీసుకుని రైలు దిగమ్మా! బయల్దేరే టైమైంది" అంది అమ్మ.

వెంటనే రైలు దిగాము. కిందికి దిగి కిటికీ వద్ద నిలబడి మళ్లీ మాట్లాడుతుండగా రైలు నెమ్మదిగా కదిలింది. కనిపించినంత మేర చెయ్యి ఊపుతూనే ఉన్నాం.

రైలు కనుమరుగయ్యాక పిల్లల్ని తీసుకుని బయటికి వచ్చాను.

## సం'చలనం'

**'అశోక్' చిత్రంలోని పాటలు అందర్నీ అలరిస్తాయంటున్నారు. ఈ చిత్రానికి మణిశర్మ అందించిన సంగీతం సంచలనాన్ని సృష్టించనుంది. ఈ సంచలనంతోనైనా సమీరా మంచి బ్రేక్‌ని సాధించాలని కోరుకుందాం.**

మర్నాడు పిల్లల్ని స్కూలుకు పంపిన తర్వాత తీరిగ్గా పేపర్ చదువుతుండగా ఫోన్ మోగింది.

కాలేజీలో నా స్నేహితురాలు సువర్చల ఫోన్ చేసింది.

"ఇంగ్లాండ్ నుండి ఎప్పుడు వచ్చావు? ఇరవై రోజుల క్రితం ఫోన్ చేస్తే నువ్వు అక్కడే ఉన్నావని మీ అమ్మగారు చెప్పారు. రాత్రి రైల్వే స్టేషన్‌లో దూరంగా కనిపించావు. నేను పిలిచినా నీకు వినిపించలేదనుకుంటాను. అందుకే నా వైపు తిరిగి చూడకుండా నీ ధ్యాసలో నువ్వు వెళ్లిపోయావు" అంది.

"రెండు రోజులైంది వచ్చి" అన్నాను. మా టూర్ విశేషాలు చెప్పాను ఆగకుండా మూడు నిమిషాల పాటు.

హఠాత్తుగా ఫోన్‌లో అవతలి నుండి పసిపాప ఏడుపు గట్టిగా వినిపించింది.

రిసీవర్ పక్కన పెట్టిన చప్పుడు.

"ఏమిటమ్మా! ఏడుస్తున్నావు? ఆకలవుతోందా? ఆ...ఆ..." సువర్చల గొంతు వినిపించింది.

బహుశా ఏడుస్తున్న పాపను ఎత్తుకుని ఉంటుంది. మరు నిమిషంలో రిసీవర్ కదలినట్లు చప్పుడు. "వకుళా! తర్వాత మాట్లాడతాను. పాపాయి ఏడుస్తోంది. ఉంటాను" సువర్చల ఫోన్ పెట్టేసింది.

ఆశ్చర్యంగా అనిపించింది. మేము లండన్ వెళ్లి ఆరు నెలలైంది. అంతకు ముందు నాలుగు నెలల క్రితం తనను కలిశాను. అడపాదడపా ఫోన్‌లో మాట్లాడుకుంటాము. తనకు ఓ బాబు, పాప ఉన్నారు. మా పిల్లల వయసే ఉంటుంది వాళ్లకు కూడా! సువర్చల ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంది. మరి ఈ పాప ఎవరు? ఆపరేషన్ ఫెయిలైందా? లేక బంధువుల పాప అయి ఉంటుందా? ఆలోచించాను గాని అర్థం కాలేదు.

మధ్యాహ్నం భోజనం చేశాక సూపర్ బజార్‌కు బయల్దేరాను. సాయంత్రం వేళల్లో సూపర్ బజార్ రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో అయితే ఖాళీగా ఉంటుంది. అందుచేత ఎక్కువగా మధ్యాహ్నం పూట వెళ్లి ప్రొవిజన్స్ తెచ్చుకోవడం నాకు అలవాటు.

కావలసిన ప్రొవిజన్స్ తీసుకున్నాను. కారు స్టార్ట్ చేసిన తర్వాత సడన్‌గా సువర్చల గుర్తొచ్చింది. తనను చూడాలనిపించింది. ఆమె ఇల్లు రెండు వీధుల అవతల ఉంది. వెంటనే కారు అటువైపు తిప్పాను.



ఊహించని విధంగా వచ్చిన నన్ను చూసి సంబరపడింది సువర్చల. చొరవగా లోపలికి వెళ్లి కూర్చున్నాను. భుజం మీద నిద్రపోతున్న పాపను లోపల బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టి తలుపు ఓరగా వేసి వచ్చింది. మా మాటలకు పాపాయికి నిద్రాభంగం కలగకుండా కాబోలు అనుకున్నాను.

"ఆపరేషన్ ఫెయిలై మరో బిడ్డను కన్నావన్నమాట! పిల్లలు లేక ఆరాటపడే వాళ్లు కొందరైతే, ఇక చాలంటున్నా ఇంకొందరికి పిల్లలు పుట్టుకొస్తారు" నవ్వాను.

సువర్చల కొద్ది నిమిషాలు మౌనంగా ఊరుకుండిపోయింది.

"ఈ పాప మా పాప కాదు. బంధువుల పాప. మా వారి పినతల్లి కూతురు వైదేహి పెద్దవాళ్లను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది. ఆ అమ్మాయి గర్భిణీగా ఉండగా భర్త యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఈ సంగతి తెలిసి కూడా పెద్దవాళ్లు పంతం వీడలేదు. వాళ్ల హృదయం కరగలేదు. నా ప్రోద్బలంతో మావారు ఆ అమ్మాయిని ఇక్కడికి తీసుకొచ్చారు. మా ఇంటికి వచ్చిన పది రోజుల్లోనే పాపను కని కన్ను మూసింది వైదేహి. నిండా 22 ఏళ్లు లేని తనకు నూరేళ్లు నిండిపోయాయి. పాపను పెంచే బాధ్యత తమ మీద పడుతుందన్న భయంతో మా చిన్నత్తగారు కానీ, అతని తల్లిదండ్రులు కానీ ఇటు తిరిగి చూడలేదు. పాప బాధ్యత మనస్ఫూర్తిగా అంగీకరించాను" చెప్పింది నా స్నేహితురాలు.

లోపలికి వెళ్లి నిద్రపోతున్న పాపాయిని చూశాను. స్నేహితురాలిని అభినందించి ఆమె పిల్లల గురించి, భర్త గురించి అడిగి తెలుసుకున్నాను. కాస్సేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత ఇద్దరం లెమన్ టీ తాగాము.

సువర్చల వద్ద సెలవు తీసుకుని ఇంటికి చేరుకున్నాను. నా స్నేహితురాలిని చూస్తే గర్వంగా, సంతోషంగా అనిపించింది.

ఈయన బందరు నుండి ఎప్పుడు వస్తారో? ఆలోచిస్తున్నాను. హృదయంలో ఇదీ అని స్పష్టంగా చెప్పలేని బాధ కదలాడింది.

అత్తయ్య ఎలా ఉందో? ఓ క్షణం ఆమె గుర్తుకు వచ్చి సర్దుకున్నాను. ఆమె మీద నాకు అయిష్టం ఎందుకో తెలుసా? విలాసంగా నిర్మించుకున్న మా ఇంట్లో ఆ వృద్ధురాలు ఉండడం నాకు సుతారామూ ఇష్టం లేదు. అందుకే ఇంత కాలం ఆమెతో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నాను. ప్రేమగా మాట్లాడితే ఇక్కడికి తీసుకొస్తారేమో అని నా భయం. అందుకే ఆమె అంటే మనసులో అయిష్టత ఏర్పరచుకున్నాను. వృద్ధురాలి ప్రస్తావన మా మధ్య రాకుండా జాగ్రత్త పడతాను. కానీ ఇప్పుడు ఎందుకో సువర్చలను కలసిన తర్వాత మా అత్తగారు జ్ఞాపకం వస్తోంది.

మంచం మీద కూర్చుని పుస్తకం చదవడానికి ప్రయత్నించాను. అక్షరాల మీద కళ్లు ఉన్నా మనసు మరెక్కడో ఉంది.

భర్త తరపు బంధువు అయిన చిన్నారి పాపకు సువర్చల మాతృత్వ మాధుర్యాన్ని పంచుతోంది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన సువర్చల ఓ అనాథ పసిపాప బాధ్యతను సంతోషంగా స్వీకరించింది. మరి నేను మా అత్తగారి బాధ్యతను తీసుకోడానికి సంకోచిస్తున్నానెందుకు? విశాలమైన ఈ భవంతిలో నివసించే నా మనసు ఎందుకింత ఇరుగ్గా మారిపోయింది? ఆలోచిస్తున్నాను.

చేయి తగిలి దిండు పక్కకు జరిగింది. దిండు సరిచేస్తుంటే మడతపెట్టిన కాగితం కనిపించింది. ఆశ్చర్యంగా తీసి చూశాను. అమ్మ రాసిన ఉత్తరం అది! రాత్రి రైలు ఎక్కిన తర్వాత 'దిండు కింద' అంటూ అమ్మ చెప్పబోయిన విషయం గుర్తుకొచ్చింది. ఉత్తరం చదవసాగాను.

"వకుళా! నీ కన్నతల్లిని అన్న బాధ్యతతో ఓ చిన్న మాట చెబుతాను. వింటావు కదూ! బందరులో మీ అత్తగారు ఒంటరిగా ఉన్నారు. ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి అపురూపంగా చూసుకోవాలన్న కోరిక అల్లుడి గారి మనసులో బలంగా ఉందని, కానీ నీకు ఇష్టం లేనందున ఆయన అందుకు సాహసించలేకపోతున్నారని నాకు అర్థమైంది. ఆ వృద్ధురాలిని ఈ వయసులో బాధపెట్టడం తగదమ్మా! భర్త మనసులోని భావాలు గుర్తెరిగి నడుచుకోవాలి తల్లీ! ఆశీస్సులతో అమ్మ"

గుండ్రటి అక్షరాలతో ఉన్న అమ్మ చేతి రాత అది. అమ్మ శివ భక్తురాలు. నిత్యం శివకోటి రాస్తుంది. అక్షరాలు గుండ్రంగా, శ్రద్ధగా, ఇష్టంగా రాస్తుంది.

ప్రతీరోజూ రాసే సాధన ఉండడం వల్ల కాబోలు నాకు ఇంత చక్కగా ఉత్తరం రాసింది. నన్ను నొప్పించకుండా నా బాధ్యతను గుర్తు చేసిన అమ్మను తలచుకోగానే కళ్లలో నీళ్లు తిరిగాయి. కొద్దిసేపు అలాగే కూర్చుండిపోయాను.

దాహంగా అనిపించి లేచి ఫ్రిజ్ వద్దకు నడిచాను. మంచినీళ్లు తాగాను. అసంకల్పితంగా గెస్ట్‌రూమ్‌లోకి వెళ్లాను.

గది నీట్‌గా సర్ది ఉంచింది అమ్మ. ఇంత కాలం అమ్మ, నాన్న ఆ గది వాడుతున్నారు. రూమ్‌లో నుండి రాబోతుండగా టేబుల్ మీద కవర్ కనిపించింది. ఏమై ఉంటుంది? ఒకవేళ నాన్నగారికి సంబంధించినదేమో! తీసి జాగ్రత్త చేద్దామనుకుని దగ్గరకు వెళ్లి చూశాను. కవర్ మీద నా పేరు కనిపించింది.

అందులో నాన్న ఏమి రాసి ఉంటారో తేలిగ్గా ఊహించాను. తెరిచి చదివాను. నేను ఊహించింది నిజమే! నాకు హితబోధ చేశారు నాన్న!

"వకుళా! భగవంతుడు నీకు అన్నీ ప్రసాదించాడు. ఏ పూర్వజన్మ పుణ్యఫలమో ఇది! బంగారం లాంటి భర్త, ముత్యాల్లాంటి బిడ్డలు. నీది పరిపూర్ణమైన జీవితం తల్లీ! వృద్ధురాలైన మీ అత్తగారు ఒంటరిగా కాలం గడుపుతోంది. నీ బిడ్డల మీద నీకు ఎంత ప్రేమ ఉందో తన ఒక్కగానొక్క బిడ్డ అయిన నీ భర్త మీద కూడా ఆ వృద్ధురాలికి అంతే ప్రేమ ఉంటుంది గదా! ఏం చేయాలో ఆలోచించు తల్లీ! కర్తవ్యం నీకే అర్థమవుతుంది. ప్రేమతో నాన్న"

అత్తగారి పట్ల నా నిర్లక్ష్య ధోరణి గ్రహించి అమ్మ, నాన్న లోలోపల ఎంత ఆవేదనకు గురయ్యారో తలచుకుంటే దుఃఖంగా కనిపిస్తోంది.

నేనేం చేయాలో నాకు అర్థమైంది. ఇక ఒక్క క్షణం కూడా వృథా చేయదలచుకోలేదు. ఆయన సెల్‌కి ఫోన్ చేశాను. "నాదొక కోరిక" అన్నాను.

"చెప్పు" నిరాసక్తంగా అన్నారు.

"అత్తయ్యను ఇక్కడికి తీసుకురాగలరా? అత్తయ్య ఎప్పటికీ మనతోనే ఉండాలి. ఇది నా కోరిక" గద్గద స్వరంతో అన్నాను.

"నిజంగానా?" సంభ్రమంగా అన్నారాయన.

"నిజంగా! అత్తయ్యకు ఫోన్ ఇస్తారా?" ఆశగా అడిగాను.

"అలాగే"

అత్తయ్యతో కొద్దిసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాను.



మూసి ఉన్న గెస్ట్‌రూమ్ కిటికీ తలుపులు బార్లా తెరిచాను. ధారాళంగా గాలి వీస్తోంది. ఆహ్లాదంగా అనిపించింది నా శరీరానికి, మనసుకు కూడా.

పిల్లలు స్కూలు నుండి వచ్చారు. స్నానం చేసి టిఫిన్ తిన్న తర్వాత ఇద్దరినీ ఆ గదిలోకి తీసుకువెళ్లాను. "ఇక నుండి ఇది గెస్ట్ రూమ్ కాదు. బామ్మ గది. మీ బామ్మ గది. బామ్మను మనం చక్కగా చూసుకోవాలి తెలిసిందా?" ఇద్దరికీ అర్థమయ్యేటట్లు చెప్పాను.

బుద్ధిగా తలూపారు.

మర్నాడు తెల్లవారుజామున ఇంటి ముందు టాక్సీ ఆగింది. అందులో నుండి అత్తయ్య దిగింది మహారాణిలా. ఆ భావన నాకు సంతోషం కలిగించింది. ఆత్మీయంగా ఎదురువెళ్లి స్వాగతం పలికాను.

ఆయన డబ్బు ఎక్కువ ఇవ్వటం వల్ల కాబోలు టాక్సీ డ్రైవర్ కృతజ్ఞతా సూచకంగా మా వారి చేతుల్లో నుండి బ్యాగ్‌లు అందుకోబోయాడు. అతన్ని వారించి తల్లి సామాను స్వయంగా మోసుకుంటూ లోపలికి తెచ్చారు ఆయన. అత్తయ్య స్నానానికి వెళ్లింది.

మా ఇంటి మహారాణిని ఇంతకాలం నేను నిర్లక్ష్యం చేసిన మాట నిజమే! ఇప్పుడు ఆమెను రాజప్రాసాదంలో అపురూపంగా చూసుకునే శక్తిని మాకివ్వమని, ఆమె స్వేచ్ఛగా, ఆనందంగా ఇక్కడ జీవితం గడపాలని భగవంతుడ్ని మనసులో ప్రార్థించాను.

అమ్మకు, నాన్నకు సంతోషం కలిగించే వార్త చెప్పాలనిపించింది. మా ఇంటి మహారాణి వచ్చిందన్న మాట వారికి చెప్పేందుకు ఫోన్ అందుకున్నాను.

## మనసు పలికే రాగం...

**సినిమాల పేరులాగే మనసు రాగాలు పలికితే ఎవ్వరి తనువైనా పులకరించకమానదు. దేగా ఆర్ట్స్ పతాకంపై నాగభూషణం దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రంలో అందాల భామ స్నేహ నటిస్తోంది. ఈ చిత్రానికి ఆనంద్, గోదావరి వంటి హిట్ చిత్రాలకి సంగీత దర్శకత్వం వహించిన రాధాకృష్ణన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి 'మనసు పలికే మౌనరాగం' అని వైరైటీ పేరు పెట్టారు.**